

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
సోమవారం 30 డిసెంబరు 2024





దొగలమర్రి: కూలూరు రహదారిలో జొన్నపంటపై కప్పేసిన పొగమంచు

ఉసురు తీస్తున్న ముసురు

- నెల రోజులుగా జాడలేని ఎండ
- పంటపై తెగుళ్లు, కీటకాల ముప్పేట దాడి
- తేమ సాకుతో దళారులు దోపిడీ
- రబీ పంటలపై తీవ్ర వాతావరణ ప్రభావం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం రైతులను తుఫాన్లు చుట్టుముట్టాయి. చేతికి వచ్చిన పంటలు సైతం తడిసి గిట్టుబాటు ధర అందడం లేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కంది తదితర పంటలకు తేమ గండం పట్టుకుంది. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర ఈసారి చేతికందుతుందనే ఆశతో రైతులు ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులకు చేతికొచ్చిన పంట ఉత్పత్తులను వ్యయ ప్రయాసలకోర్చి తీసుకువెళ్తున్నారు. అయితే.. నెల రోజులుగా ముసురు కమ్మేసి ఎండ జాడ లేకపోవడంతో పది నుంచి 20 శాతానికి పైగానే పంట ఉత్పత్తులకు తేమ పట్టేసింది. ఈ సాకుతో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు మద్దతు ధరలో దాదాపు 30 శాతం ధర తగ్గించి మిగిలింది రైతుల చేతిలో పెడుతున్నారు.



ఈ రైతు పేరు గోరంట్ల, ఈయనది ప్యాపిలి. తనకున్న నాలుగెకరాల పొలంలో దాదాపు రూ.లక్ష ఖర్చు పెట్టి వేరుశనగ పంటను సాగు చేశాడు. 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. శుక్రవారం ట్రాక్టరులో వేరుశనగ బస్తాలను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చాడు. తేమ 20 శాతం కంటే ఎక్కువగా ఉందని కుంటి సాకు చెప్పి వ్యాపారి క్వింటానికి రూ.4,900లు మాత్రమే చేతిలో పెట్టాడు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదని, అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని విలేకరుల ముందు గొల్లుమన్నారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పత్తి, పొగాకు, వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలు సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి.



కొలిమిగుండ్లలో పంటపొలాలపై కురుస్తున్న పొగమంచు

నెల రోజులైనా ఎండ రాలేదు..

గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులపై అల్పపీడనం, తుఫాన్ తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాదాపు నెల రోజులుగా ముసురు వీడడం లేదు. ఎండ జాడ లేకపోవడం వల్ల రైతులు పత్తి తీయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ యంత్రాంగం మండల, జిల్లా కేంద్రాల్లోని నివాసాలకే పరిమితం అవుతుండటంతో తమకు సరైన సలహాలు ఇచ్చే వారు లేక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. మండల కేంద్రాల్లో పని చేసే వ్యవసాయాధికారులతో పాటు చివరకు గ్రామాల్లో రైతు సలహా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది కూడా ప్రస్తుతం నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లోనే తిష్ట వేస్తున్నారు. వారానికి ఒకసారి రైతులకు ముఖం చూపించి గంటకే తిరిగి వచ్చేస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.



ముసురు, చినుకులకు పాడైన కొర్ర పంట నిల్వ

రబీ పంటలకూ ముప్పే

ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, వేరుశనగ, మిర్చి, ఉల్లి తదితర పంటలను ముసురు కమ్మేసింది. ఎండ జాడ లేకపోవడం వల్ల మిర్చి పంటకు నల్లి, తామర, ఆకుముడుత తెగుళ్లు భారీగా వ్యాపించాయి. పొగాకు పంటకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరం 50 వేల ఎకరాల్లో పొగాకు పంటను రైతులు సాగు చేశారు. గత సంవత్సరం క్వింటం పొగాకు కంపెనీలు రూ.15 వేలకు పైగానే ధరను రైతులకు చెల్లించారు. ఈసారి నిబంధనల కంటే తేమ ఎక్కువగా ఉందని సాకు పెట్టి క్వింటానికి రూ.10 నుంచి 13 వేలు మాత్రమే అందజేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

పంటల ధరపై తేమ ప్రభావం

కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు ఆరు లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. రాష్ట్రంలో అత్యధికంగా ఈ పంట సాగైన జిల్లాల్లో కర్నూలు మొదటి స్థానంలో ఉంది. సీసీఐ అధికారులు 8 నుంచి 12 శాతం లోపు తేమ ఉంటేనే క్వింటానికి రూ.7,521 అందిస్తామని చెప్పారు. తేమ శాతం ఉండడంతో రైతులు రూ.6 వేల నుంచి రూ.6,500కే దళారులకు గ్రామాల్లోనే అమ్మేస్తున్నారు. వేరుశనగ కాయలకు గత సంవత్సరం రూ.8 వేల దాకా అందింది. దాదాపు 2 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగైంది. గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఈసారి 8 క్వింటాళ్లకు పైగా చేతికి రావడంతో రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అప్పులన్నీ తీరిపోతాయని, కుటుంబ జీవనానికి ఢోకా ఉండదని ఆనందించారు. నెల రోజులుగా ఎండ తెరపి ఇవ్వకుండా ముసురు కమ్ముకోవడంతో వేరుశనగ కాయల ధర భారీగా పతనమైంది. క్వింటానికి మద్దతు ధర కేవలం రూ.5వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే రైతుకు అందుతోంది. మొక్కజొన్న రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఖరీఫ్‌లో సాగు చేసిన ఈ పంట ఇప్పుడిప్పుడే రైతుల చేతికి అందుతోంది. ఈ ముసురు కారణంగా పెరిగిన మొక్కజొన్న గింజలను ఆరబెట్టుకోవడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి దాపురించింది. క్వింటం మొక్కజొన్నలకు కేంద్ర ప్రభుత్వం రూ.2,350 నిర్ణయించింది. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డులో రూ.2వేల నుంచి రూ.2,100 వరకు రైతులకు అందుతోంది. కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగతోపాటు బోరు బావుల కింద రైతులు దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.1700 మద్దతు ధర ప్రకటించింది. అయితే.. దళారులు తేమ పేరుతో భారీగా దోపిడీకి తెరలేపారు. 18 శాతం కంటే తేమ ఎక్కువగా ఉండటం వల్ల మద్దతు ధర కంటే తక్కువగా రూ.1,300కే అమ్మాలని షరతు పెడుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.



కర్నూలు యార్డుకు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

రైతులు జాగ్రత్త పడాలి


పొలాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పంట నష్టం గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం ముసురు వానలు పడుతుండటం వల్ల నీరు పొలాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రస్తుతం కోతలు చేయరాదు. ఎప్పటికప్పుడు గ్రామాలకు వెళ్లి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని మా అధికారులు, సిబ్బందిని ఆదేశించాం



- వరలక్ష్మి, జేడీ

శాంతి భద్రతలు కొంచెం నయం





మరో రెండు రోజుల్లో 2024 కాలగర్భంలో కలిసిపోనుంది. ఈ ఏడాది అటు పాలనాపరంగా.. ఇటు ప్రభుత్వ పరంగా జిల్లాలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఆరు నెలలు వైసీపీ పాలన కాగా.. మరో ఆరు నెలలు కూటమి పాలన కొనసాగింది. పోలీసు శాఖలో పలు మార్పులు జరిగాయి.. నేరాలు తగ్గుతున్నట్లు కనిపించినా గత ఏడాదితో పోలిస్తే అదే స్థాయిలో ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగాయి. సైబర్ నేరగాళ్లు పంజా విసిరారు. కొత్తగా వచ్చిన పోలీసు బాస్ శాంతిభద్రతలను కంట్రోల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే అక్కడక్కడ కింది స్థాయి పోలీసులు ఎస్పీ ఆదేశాలు పెడ చెవిన పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నా.. పోలీసు శాఖ తగినట్లు పని చేయడం లేదు. ఈ ఏడాది సోషల్ మీడియా పోస్టులపై 56 కేసులు నమోదు చేయడం గమనార్హం. ఎస్పీ నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో కింది స్థాయి పోలీసులు నిర్లక్ష్యంగా ఉన్నారు. పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తూ కేసులు మూసేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

వివరాలు 7లో..

మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను నియామకంలో రిజర్వేషన్లను ఖరారు చేయమని కలెక్టర్లకు బాధ్యతలు అప్పజెప్పుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు మార్కెట్ కమిటీకి ఓసీ జనరల్‌ను ఖరారు చేశారు. ఆదోని మార్కెట్ యార్డు బీసీ అండ్ మైనార్టీ (ఉమెన్) రిజర్వేషన్ ఖరారు చేశారు. ఎమ్మిగనూరు బీసీ లేదా మైనార్టీ (జనరల్)కు ఖరారు చేశారు. ఆలూరు ఎస్సీ (జనరల్), పత్తికొండ మార్కెట్ కమిటీ ఓసీ (జనరల్)కి కేటాయించారు. అలాగే కోడుమూరు ఓసీ (ఉమెన్), మంత్రాలయం ఓసీ (మహిళ)కి ఖరారు చేస్తూ కలెక్టర్ పి. రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. సంక్రాంతిలోపు ఆయా మార్కెట్ కమిటీలకు కలెక్టర్ ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించేందుకు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి ఆ మార్కెట్ కమిటీల పరిధిలోని ఎమ్మెల్యేల చేత ప్రతిపాదనలు తీసుకోనున్నారు.

నంద్యాల జిల్లాలో..

నంద్యాల జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల, ఛైర్‌పర్సన్ల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల మార్కెట్ కమిటీ ఓసీ (మహిళ)కు, ఆళ్లగడ్డ ఎస్సీ(మహిళ), డోన్‌కు బీసీ (మహిళ)కి ఖరారు చేస్తూ ఉత్వర్వులు ఇచ్చారు. నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఓసీ (జనరల్)కి, ఆత్మకూరుకు ఓసీ (జనరల్), బనగానపల్లె ఓసీ (జనరల్)కి కేటాయించారు. కోవెలకుంట్ల ఓసీ (జనరల్)కి, పాణ్యం బీసీ (మహిళ)కి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

చిన్న కాంట్రాక్టర్లకు అండగా ఉంటాం
ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 7
సుంకేసుల నీటిని వృథా కానివ్వొద్దు
జాయింట్ కలెక్టర్ నవ్య 7
నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ మైదానంలో సోమవారం నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రారంభమయ్యే దేహదారుఢ్య పరీక్షల రిహార్సల్స్ ఏర్పాట్లను ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదివారం పరిశీలించారు. అనంతరం పరీక్షల నేపథ్యంలో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది, కొంత మంది యువకులతో ఆయన రిహార్సల్స్ నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందితో సమావేశమై పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే పలు సూచనలు ఇచ్చారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు జరగనున్నాయన్నారు. హైదరాబాదు నుంచి వచ్చిన టైమింగ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో ఆర్‌ఎఫ్‌ఐడీ సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు జి.హుశేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు, డీపీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ



రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఇష్టమొచ్చినట్లు దోచుకున్న జగన్

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్
- ఎమ్మిగనూరులో అట్టహాసంగా మొదలైన జిల్లా మహాసభలు

ఎమ్మిగనూరు , డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రాన్ని ఇష్టమొచ్చినట్లు దోచుకున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఏ గఫూర్ ధ్వజమెత్తారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో సీపీఎం 23వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీపీఎం జిల్లా నాయకులు రామాంజనేయులు అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు హాజరైన ఎంఏ గఫూర్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రైతులు, విద్యుత్ చార్జీలపై జగన్ ఆందోళన చేయాలని పిలుపునిచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ చార్జీలు పెరగడానికి ఎవరు కారణమో జగన్ ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. జగన్ ప్రతి ఏటా ప్రజలకు మేలు చేస్తున్నాననే పేరుతో రూ.12లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. దేశంలోని విమానాలను టాటా కంపెనీకి అమ్మేశాడని, అలాగే రైళ్లను కూడా అమ్మేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అంతేగాక విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీ అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. 2014లో చంద్రబాబు జిల్లాలోని ఆర్డీఎస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను కడతామని చెప్పి నేటికీ పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. దీంతో కర్నూలు జిల్లాలో నిత్యం వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. పోరాడే ప్రజలకు అండగా ఉండేది ఎర్రజెండా అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకురాలు నిర్మలమ్మ, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, గోవిందు, హనుమంతు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సంవత్సరం ముగింపు రోజులు కావడంతో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. భక్తుల రద్దీతో క్యూ కంపార్ట్‌మెంట్స్ అన్నీ కిక్కిరిసిపోయాయి. స్వామి, అమ్మవార్ల దర్శనానికి 4 గంటలపైగా సమయం పట్టింది. రోజులో మూడు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కల్పించారు.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శాంతి భద్రతలు కొంచెం నయం






- దొంగతనాలు ఎక్కువ.. రికవరీలు తక్కువ
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు..
- సోషల్ మీడియాపై పోలీసుల ఉక్కుపాదం
- ఫలితమివ్వని ప్రచారం.. జిల్లాలో విసిరిన సైబర్ పంజా
- పబ్లిక్ గ్రీవెన్స్ ఫిర్యాదులపై స్పందన కూడా అంతంతే..
- లోక్ అదాలత్‌లో కర్నూలు పోలీసులు భేష్
- మారిన పోలీసు బాస్‌లు
- ప్రశాంతంగా ఎన్నికలు
- 2024 క్రైం రౌండప్

కర్నూలు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూలు రేంజ్ డీఐజీ, కర్నూలు ఎస్పీగా కొత్తవారు బాధ్యతలు చేపట్టారు. డీఐజీగా కోయ ప్రవీణ్, ఎస్పీగా జి. బిందుమాధవ్ వచ్చారు. వీరిద్దరు వచ్చాక పోలీసు శాఖలో పలు మార్పులు వస్తాయనుకున్నా అలాంటిదేమీ పెద్దగా జరగలేదు. కర్నూలు, నంద్యాల జిల్లాలో సీఐలు, ఎస్ఐల బదిలీల్లో మొదట్లోనే గందరగోళానికి తెర తీసింది. వైసీపీలో కొనసాగిన చాలా మంది పోలీసు అధికారులే పోస్టింగులు దక్కించుకున్నారు. ఐదేళ్లుగా పోస్టింగ్ కోసం ఎదురు చూసిన కొంత మందికి రాజకీయ ఒత్తిడి వల్ల ఊహించిన స్థాయిలో పోస్టింగులు దక్కలేదు. అప్పట్లో వైసీపీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోని రాజకీయ నాయకులకు అనుకూలంగా ఉన్న వారే పోస్టింగులు దక్కించుకోవడం విశేషం.

పెరిగిన దొంగతనాలు.. తగ్గిన రికవరీలు



పోలీసుల రికార్డుల్లో మాత్రం గత ఏడాదితో పోల్చితే 7.45 శాతం పగటి దొంగతనాలు 7.83 శాతం రాత్రి దొంగతనాలు జరుగుతున్నాయి. అయితే చాలా దొంగతనాలు, ఛైన్ స్నాచింగ్‌లను పోలీసులు తమ రికార్డుల్లో నమోదు చేయడం లేదు. 2023లో 149 కేసులు కాగా.. 2024లో 138 కేసులు మాత్రమే నమోదైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. 2023లో 27 పగటి దొంగతనాలు కేసులు నమోదు కాగా, 2024లో 25 కేసులు మాత్రమే నమోదయ్యాయి. 2023లో 122 రాత్రి దొంగతనాలు కేసులు నమోదు కాగా, 2024లో 113 కేసులు నమోదయ్యాయి. పలు పోలీసు స్టేషన్‌లలో అటు దొంగతనాలు, ఇటు స్నాచింగ్‌లు కానీ కేసులు నమోదం చేయడం లేదనే విమర్శలున్నాయి. రికవరీలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2024లో రూ.5.65 కోట్లు సొత్తు చోరీకి గురి కాగా, రూ.3.67 కోట్లు మాత్రమే రికవరీ చేయించారు. కొంత మంది నిందితులను పట్టుకున్నా.. చిన్న చిన్న లోపాలతో వారిని వదిలేస్తున్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ గజదొంగను పట్టుకున్నప్పటికీ.. రికవరీ ఆలస్యం కావడంతో చట్టంలోని లొసుగులతో నిందితుడు తప్పించుకున్నాడు. ఇలాంటి ఘటనే కర్నూలు టూ టౌన్, ఫోర్త్‌టౌన్, ఆదోనిలలో జరిగాయి. చోరీకి గురైన సొత్తు తాకట్టు పెట్టుకున్న పలు సంస్థలు పోలీసుల లేఖతోనే వెనక్కు ఇచ్చామని, ఈసారి మాత్రం ఆ సంస్థలు కోర్టు ద్వారా ఆదేశాలు కావాలంటుండటంతోనే ఈసారి రికవరీలు కాస్త వెనుకబడ్డాయని తెలుపుతున్నారు.

మహిళలపై ..



2023-24లో ఒక వరకట్నం మరణం కేసు నమోదైంది. 2023లో 12 అత్యాచార కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 10 కేసులు మాత్రమే నమోదయ్యాయి. 2023లో 22 పోక్సో గ్రేవ్ కేసులు నమోదు కాగా, 22 నాన్ గ్రేవ్ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 30 గ్రేవ్ కేసులు, 32 నాన్ గ్రేవ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఈ కేసులను మిస్సింగ్ కేసులుగా చూపెట్టడంతోనే ఆ సంఖ్య తగ్గిందని, ఈ ఏడాది చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడంతోనే ఈ సంఖ్య పెరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఈ ఏడాది 244 మహిళల మిస్సింగ్ కేసులు నమోదు కాగా, 232 మందిని ఛేదించారు. 154 బాలికల మిస్సింగ్ కేసు నమోదు కాగా.. 147 మందిని ట్రేస్ చేశారు.

పెరిగిన రోడ్డు ప్రమాదాలు

2023లో 499 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. ఈ ఏడాది 523 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. గతంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు పలు చర్యలు తీసుకోగా.. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో పోలీసులంతా బందోబస్తు విధుల్లో ఉండటంతో ఈ ప్రమాదాలు తగ్గించడంలో కాస్త వెనుకబడ్డారు. మరోపక్క రవాణాశాఖ అధికారులు పలు బ్లాక్ స్పాట్లు గుర్తించినా.. ఆ బ్లాక్ స్పాట్లలో చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం ముందుకు రాకపోవడంతో ప్రమాదాలు అదే స్థాయిలో కొనసాగుతున్నాయి. గతంలో ప్రతి ఏడాది రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేవారు. ఐదేళ్ల నుంచి రోడ్డు భద్రతా వారోత్సవాలు జరగడం లేదు.



సైబర్ పంజా



జిల్లాలో ఈ ఏడాది పోలీసుల ఎన్నికల బందోబస్తు నేపథ్యంలో 104 సైబర్ కేసులు నమోదు అయ్యాయి. గత ఏడాది ఇవి 41 కేసులు మాత్రమే. కొత్తగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బిందుమాధవ్ ఈ సైబర్ నేరాలపై పలు విద్యాసంస్థలు, వివిధ సంఘాలు, సంస్థలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినా కూడా ఈ సైబర్ నేరాల కేసులు పెరగడం విశేషం. గతంలో సైబర్ నేరాలను పోలీసులు నమోదు చేసుకోకపోవడంతోనే పెద్దగా కేసులు లేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి సైబర్ కేసు నమోదు చేయడంతో ఆ సంఖ్య పెరిగిందని పోలీసులు చెబుతున్నారు.



సెల్‌ఫోన్ రికవరీ మేళాను పరిశీలిస్తున్న ఎస్పీ(ఫైల్)

లోక్ అదాలత్‌ల పరిష్కారంలో మొదటి స్థానం!



ఈ ఏడాది నాలుగు విడతలుగా లోక్ అదాలత్‌లో కేసులుకు 3,220 కేసులు పరిష్కారించారు. మూడో లోక్ అదాలత్‌లో 3వ స్థానం, నాల్గవ లోక్ అదాలత్‌లో మొదటి స్థానంలో జిల్లా నిలబడింది. ఈ మేరకు జిల్లా పోలీసులకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది.

ఎంవీఐ యాక్టు కేసులు

ఈ ఏడాది 3,631 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి రూ.19.42 లక్షల జరిమానా విధించారు. 63,626 ఎంవీఐ యాక్టు కేసులు నమోదు చేసి రూ.2.41 కోట్లు జరిమానా విధించారు. 1225 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

2024లో 65 మట్కా కేసులు నమోదు చేసి 162 మందిని అరెస్టు చేశారు. 252 పేకాట కేసులు నమోదు చేసి 1251 మందిని అరెస్టు చేసి రూ.72.93 లక్షలు నమోదు చేశారు. మూడు క్రికెట్ బెట్టింగ్ కేసులో 6.50 లక్షలు సీజ్ చేశారు.

హత్య కేసులు



2023లో 38 హత్య కేసులు నమోదు కాగా.. 2024లో 31 కేసులు నమోదయ్యాయి. 2023లో 48 హత్యాయత్నం కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 39 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. గత ఏడాది 15 కిడ్నాప్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది 15 నమోదయ్యాయి.

జిల్లాలో ప్రధాన సంఘటనలు

- ఈ ఏడాది జూలై 27వ తేదీన ఆస్పరి పోలీసు స్టేషన్ పరిధిలో ఎమ్మిగనూరు మండలం మసీదుపురం చెందిన పేటయ్య అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఎలాంటి క్లూ లేకున్నా పోలీసులు రెండు రోజులోలనే పోలీసులు నిందితుడ్ని పట్టుకోవడంతో రాష్ట్ర స్థాయిలో ఈ కేసు మూడో స్థానంలో నిలిచి ఏబీసీడీ అవార్డుకు ఎంపికైంది. ఈ కేసు పోలీసు ప్రతిభకు ఉదాహరణ.
- ఆదోని పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.32లక్షల విలువైన బైకులు రికవరీ చేశారు. ఈ నెల 17న బుధవారపేటలో అసదుల్లా చెందిన పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి 31 మంది పేకాటరాయళ్లను అరెస్టు చేసి రూ.31.40 లక్షలు, రెండు కార్లు, 40 ఫోన్లు సీజ్ చేశారు.



ఆదోనిలో దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ(ఫైల్)

పోలీసు శాఖ సమర్థవంతంగా పని చేస్తోంది



గత ఏడాదితో పోలిస్తే.. ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గింది. పోలీసు శాఖ సమర్థవంతంగా పని చేయడం వల్లనే ఇది సాధ్యమైంది. మున్ముందు కూడా శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి 5వేల సీసీ ఈ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక డ్రోన్ కెమెరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. సైబర్ నేరాల పట్ల గ్రామీణ స్థాయిలో కూడా అవగాహన కల్పించేందుకు సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసు శాఖ చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటుంది.

- జి. బిందుమాధవ్, ఎస్పీ



'అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటు చేయాలి'

కర్నూలు అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని అంబేడ్కర్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఓబులేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సిల్వర్ జూబ్లీ కళాశాల కాంపౌండ్‌లోని అంబేడ్కర్ సెంటర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిశారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి నడుస్తున్న ఈ సెంటర్ల ద్వారా 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో అభ్యాసక సహాయక కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు చేరారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు 89 శాతం అడ్మిషన్ తీసుకుంటున్నారని, మొత్తం విద్యార్థుల్లో 48 నుంచి 49 శాతం మహిళలు ఉంటున్నారని చెప్పారు. మొత్తం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో 12శాతం దూర విద్య విద్యార్థులు ఉన్నారని, మొత్తం విద్యార్థుల్లో 90 శాతం బీసీ ఎస్సీఎస్టీ మైనార్టీ వర్గాలవారు ఉన్నారని చెప్పారు. తెలంగాణలోని వర్సిటీకి ఏటా ఫీజుల రూపంలో ఏటా రూ.21 కోట్లు చెల్లిస్తుండగా అందులో కేవలం రూ.4 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు హనుమంతప్ప, గంగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు ప్రసాదాలను అందజేస్తున్న డిప్యూటీ ఈవో రమణమ్మ

శ్రీశైలం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వి. భాస్కరరావు రూ.5,00,004 విరాళం ఇచ్చారు. డిప్యూటీ ఈవో ఆర్. రమణమ్మకు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

సుంకేసుల నీటిని వృథా కానివ్వొద్దు

జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుంకేసుల జలాశయం నీటిని వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పొదుపుగా వాడాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య నీటి పారుదల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఆదివారం జాయింట్ కలెక్టర్ నవ్య సుంకేసుల జలాశయాన్ని పరిశీలించారు. జలాశయ గేట్ల ద్వారా వృథాగా వెళ్తున్న నీటిని పరిశీలించారు. గేట్లను తక్షణమే రిపేరు చేయాలని స్పష్టం చేశారు. డీఈ ప్రసాద్ సుంకేసుల జలాశయంలో 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉండటం వల్ల గేట్లను మరమ్మతులు చేయడం సాధ్యం కాదని, గజ ఈతగాళ్లను రప్పించి రబ్బర్ తొడుగులను అమర్చగలిగితే.. నీటి వృథా కొంతవరకు లేకుండా చేయవచ్చని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం సుంకేసుల జలాశయంలో 1.2 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కేసీ కెనాల్ కింద జిల్లాలో 3,820 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నామని, కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు ఇబ్బందులు లేకుండా నీటిని నిల్వ చేశామని డీఈ ప్రసాద్ వివరించారు. ఖర్చులకు వెనుకాడకుండా గేట్లను మరమ్మతులు చేయాలని, కలెక్టర్‌తో మాట్లాడి నిధులను విడుదల చేయిస్తామని జేసీ తెలిపారు. జేసీ వెంట సబ్ ఇంజనీర్ భరత్ పాల్గొన్నారు.

చిన్న కాంట్రాక్టర్లకు అండగా ఉంటాం

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల



డైరీని ఆవిష్కరిస్తున్న అతిథులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్న కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఆదివారం నగర శివారులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లను దోపిడీదారులుగా చూసిందని, తమ ప్రభుత్వం కాంట్రాక్టర్లను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములను చేసి, ఆర్థికాభివృద్ధిలో వారికి సహకరింస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల పంపిణీకే సరిపోతుందని వైసీపీ రూ.10లక్షల కోట్ల అప్పును రాష్ట్రంపై మోపి వెళ్లిందన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు ఆర్థిక శాఖ అధికారులు, మంత్రులు అందు బాటులో ఉండేవారు కాదని.. కానీ సమస్యను సానుకూలంగా చర్చించి పరిష్కారానికి మార్గం కనుగొనాలనే ఉద్దేశంతోనే తాను ఈ సమావేశానికి వచ్చినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రభుత్వం, కాంట్రాక్టర్లు పరస్పర సహకారంతో నడుచుకున్నప్పుడే బిల్లు బకాయిల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గ్రామ పంచాయతీలకు స్వయంగా నిధులను వినియోగించుకునేలా అధికారాలు ఇచ్చామని, అదే విధంగా రాబోయే మార్చిలోపు మున్సిపాలిటీల్లోనూ నిధులను వారే ఖర్చు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని పునఃనిర్మించడానికి కాంట్రాక్టర్ల పాత్ర అవసరమన్నారు. విశాఖ (ఉత్తర) ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ఆశాజ్యోతి పయ్యావుల కేశవ్ అని, సమస్యలను పరిష్కరించేం దుకు ఎప్పుడూ ముందుంటారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ పనులు చేసిన వెంటనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆర్థిక శాఖ కార్యదర్శిని కలవాలంటేనే గగనంగా ఉండేదని, అటువంటిది తమ కార్యక్రమానికి ఆర్థిక మంత్రే రావడం హర్షణీయమన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, సబ్కా వ్యవస్థాపక అధ్యక్షుడు పిపి రాజు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది వాల్మీకి శేషాద్రి మరణానికి కారణమైన నిందితులను తక్షణమే శిక్షించాలని వాల్మీకి సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రైవేటు హోటల్‌లో జిల్లాలోని వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి శేషాద్రి న్యాయవృత్తి చేపట్టి ఎంతో మంది పేద ప్రజలకు సేవ చేశారన్నారు. అలాంటి వ్యక్తిని కొందరు ఎన్నో చిత్రహింసలు గురి చేశారన్నారు. కార్యక్రమంలో హరి, మద్దిలేటి, మండ్ల శేఖర్, రవి, శంకర్ నాయుడు, గోపాల్, శంకర్, మధు, శంకర్ పాల్గొన్నారు.

మాధవుడిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతి



దర్శించుకుంటున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో ఆదివారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు పూర్ణకుంభంతో ఎదురేగి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న విద్యారణ్యస్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామిజీకి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇదే స్ఫూర్తితో పని చేయాలి: ఎస్పీ


కర్నూలు క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయడం వల్లనే జిల్లాలో గణనీయంగా నేరాలు తగ్గాయని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో బాగా పని చేయాలని జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ జి. బిందుమాధవ్ అభినందించారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కొనసాగించాలన్నారు. వివిధ కేసులలో, విధులలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను సిబ్బంది అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, సోమన్న, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆస్పరి, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న హరివాణం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే యువకుడు ఆదివారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన ఉల్లిగమ్మ, రంగన్న దంపతులకు చెందిన చంద్రశేఖర్ కుటుంబ సమస్యలపై విరక్తి చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతను ఆదోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితునికి భార్య, ఒక కూతురు ఉన్నారు.

ఎస్ఐ మృతి

కొలిమిగుండ్ల/ తాడిపత్రి/, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగవీరయ్య (60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన నాగవీరయ్య 2021లో ఉద్యోగోన్నతిపై తాడిపత్రి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. నాలుగురోజుల క్రితం ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. తాడిపత్రికి తరలించి, పోలీసు లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్ఐకి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



నాగవీరయ్య (ఫైల్)

నేడు నగర పాలకలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఎక్కడైనా కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని ఆయన కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగర పాలక కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు హర్షవర్ధన్ ఎంపిక

కర్నూలు అర్బన్, డిసెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో 26న రిపబ్లిక్ డే ఉత్సవాలకు ఎంపికైన హర్షవర్ధన్ అనే విద్యార్థిని రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అభినందించారు. ఆదివారం వర్సిటీలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థికి తగిన సూచనలు చేశారు. వర్సిటీ ప్రారంభం నాటి నుంచి మొదటిసారి ఉమ్మడి జిల్లాకు చెందిన డిగ్రీ విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమని కొనియాడారు. రిపబ్లిక్ పేరేడ్‌తో పాటు ఫిబ్రవరి మొదటి వారం వరకు జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వినతి పత్రాల అందజేత


మాట్లాడుతున్న సమితి రాష్ట్ర అధ్యక్షుడు జానయ్య

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కులగణన విషయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అభ్యంతరాలకు సంబంధించి వినతి పత్రాలు అందజేయాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం డా.బీఆర్.అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర సచివాలయాల్లో ఎస్సీ కులగణన నివేదికలు తప్పులుతడకగా ఉన్నాయని అన్నారు. ఎమ్మార్పీఎస్ సైనికులందరూ ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి సచివాలయాలు, కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల్లో అభ్యంతరాలకు సంబంధించి వినతి పత్రాలు అందజేయాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర సలహాదారుడు ఎరుకల అంజినయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాశపోగు ప్రశాంత్ కుమార్ మాదిగ, అధికార ప్రతినిధి ఏ.సత్యన్న పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై ఉద్యమించండి


మండల కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు ఈశ్వర్

ఓర్వకల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యల కోసం ఉద్యమించాలని సీఐటీయూసీ ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో ఆటో వర్కర్స్ యూనియన్ మండల నూతన కమిటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆటో లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల క్రమబద్ధీకరణలో ఉండాలని, ఆటో కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. నూతన కమిటీలో గౌరవాధ్యక్షులుగా సుధాకర్, ఆటో యూనియన్ మండల కార్యదర్శిగా బాల రంగయ్య, అధ్యక్షునిగా సంజీవరాజు, సహాయ కార్యదర్శిగా రమేష్, ఉపాధ్యక్షుడుగా ఇస్మాయిల్‌తో పాటు కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వలి, అనిల్, రాంబాబు, రమేష్, ఇద్రుస్ బాషా పాల్గొన్నారు.

ఓర్వకల్లు మండల నూతన కమిటీ ఏకగ్రీవం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకుడు సూరి

ఓర్వకల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎంఎస్‌పీ అధికార ప్రతినిధి కాశపోగు సూరి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి కాశపోగు పరమేష్ మాదిగలు హాజరయ్యారు. మండల సీనియర్ నాయకులు గుండమయ్య మాదిగ, శ్రీను మాదిగ ఆధ్వర్యంలో మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బొగ్గుల మహేంద్రబాబు మాదిగ, మండల ఉపాధ్యక్షుడిగా నారాయణ మాదిగ, మండల అధికార ప్రతినిధి సురేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శులుతో పాటు మెంబర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31లోపు ఈకేవైసీ చేయించుకోండి

ఓర్వకల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేనాపురం, ఓర్వకల్లు గ్రామాల్లో ఉన్న సహకార సంఘాలకు చెందిన ఖాతాదారులందరూ ఈ నెల 31లోపు స్థానిక సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సీఈవోలు మాలిక్‌బాషా, మద్దిలేటి ఆదివారం పేర్కొన్నారు. ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు, సున్నా వడ్డీ రుణాలు, ఎరువుల కొనుగోలు, ఖాతాదారులు పండించిన పంటల కొనుగోలుకు ఈకేవైసీ ఉపయోగపడుతుందన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే రాయితీలు అందకపోవడంతో పాటు ఓటు హక్కును కూడా కోల్పోవాల్సి వస్తుందని అన్నారు.

హేతువాద సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా జేవీ కృష్ణయ్య


సదస్సులో ప్రసంగిస్తున్న జేవీ కృష్ణయ్య

కర్నూలు కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): హేతువాద సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ జేవీ కృష్ణయ్య ఎన్నికయ్యారు. తమిళనాడులోని తిరుచునాపల్లి నగరంలో గత రెండు రోజులుగా కొనసాగిన 13వ జాతీయ హేతువాద సదస్సు (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్టు అసోసియేషన్స్) ఆదివారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ ముగింపు సమావేశంలో జాతీయ సంఘానికి సంబంధించిన నిమామకాలకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను ఎంపిక చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడి హేయం

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని సహించబోమని నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం స్పష్టం చేసింది. అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడిని నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి కే.గిరిశ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రజా సేవకులపై దాడి చేయడం దారుణమని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోకులం షెడ్లపై రైతన్నల ఆసక్తి

- అధికారులకు భారీగా దరఖాస్తులు

ఓర్వకల్లు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మునుపటి లాగే మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. వీటి నిర్మాణం కోసం పశు పోషణలకు 90 శాతం రాయితీ ఇవ్వాలని పశుసంవర్ధక శాఖకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలకు శ్రీకారం చుట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. దీంతో నిధులు మంజూరు కాక రైతులు వెనక్కి తగ్గారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించింది. దీంతో పశు పోషణకు మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శర వేగంగా గోకులం షెడ్ల నిర్మాణం

ఓర్వకల్లు మండలానికి మొదటి దశలో 26 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. నెల రోజుల్లోగా అన్ని నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుతం 3 షెడ్లు పూర్తయ్యాయి. మిగిలిన 23 షెడ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో అధికారులు చొరవ తీసుకుని లబ్ధిదారులతో త్వరతగతిన షెడ్లు పూర్తి చేస్తున్నారు.

ఆసక్తి చూపుతున్న రైతన్నలు

మండలానికి మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి అవుతుండటంతో వీటి కోసం ప్రస్తుతం మండలంలో ఆయా గ్రామాల పాడి రైతులు అధికారులకు భారీ సంఖ్యలో దరఖాస్తులు అందజేశారు. దీంతో రెండో విడతగా 74 షెడ్లు కావాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.


హుస్సేనాపురంలో పూర్తయిన గోకులం షెడ్డు

జనవరి 25లోగా పూర్తి చేస్తాం



మండలంలో మంజూరైన గోకులం షెడ్లలో ఇప్పటికే 3 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని జనవరి 25లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. షెడ్ల నిర్మాణానికి నిధులు పూర్తి స్థాయిలో మంజూరవుతుండటంతో రైతులు ముందుకు వస్తున్నారు.

- కుమార్ సాయినాథ్ ఏపీవో, ఓర్వకల్లు

షెడ్ల కోసం రైతుల ఎదురుచూపులు



గోకులం షెడ్ల కోసం పాడి, కౌలు రైతుల మంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్షణమే పాడి రైతుల కోసం గోకులం షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం శుభపరిణామం.

- బత్తుల వెంకటరమణ కౌలు రైతు, ఓర్వకల్లు

నిధులు మంజూరయ్యాయి



కూటమి ప్రభుత్వం సహకారంతో గత నెలలో గోకులం షెడ్డు నిర్మించుకున్నాం. ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసింది. ఈ షెడ్డు పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- సి. మంజుల పాడి రైతు, హుస్సేనాపురం

వందేళ్ల పోరాటాల చరిత్ర

కూటమి ప్రభుత్వంలో ఎక్కడ చూసినా బెల్టు షాపులే

ఇసుక దోచుకుంటున్నారు

ప్రభుత్వాలు మారినా నేతలు బుద్ధి మారడం లేదు : రామచంద్రయ్య


బహిరంగ సభలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

కోడుమూరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): వంద ఏళ్ల చరిత్ర కల్గిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు సి.రామచంద్రయ్య అన్నారు. కమ్యూనిస్టు పార్టీ శతజయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ నుంచి సంత మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నేవాడిదే భూమి అనే భూసంస్కరణ చట్టాన్ని, కార్మికుల కోసం 8 గంటల పని విధానం తీసుకొచ్చిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకే దక్కిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం కార్మికుల హక్కుల చట్టాలకు తూట్లు పొడిచే ప్రయత్నాలు సాగుతున్నాయని, దేశంలోని సంపన్నులకు దోచి పెటేందుకు అవసరమైతే రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ ప్రభుత్వం ఆ దిశగా పయనిస్తుందన్నారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి హత్య చేస్తుంటే ప్రశ్నించే వాళ్లే కనిపించడం లేదు. ఆ ప్రాంతంలో ప్రధాన నరేంద్రమోదీ పర్యటించిన దాఖలాలు లేవని చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో నాయకులంతా భూ కబ్జాలకు పాల్పడి దోచుకున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసగించందన్నారు. కూటమి ప్రభుత్వంలో బెల్టు షాపులు విచ్చల విడిగా ఏర్పడ్డాయని, ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారినా నేతలు బుద్ధులు మాత్రం మారడం లేదని, దోచుకోవడం, దాచుకోవడమే అన్నట్టుగా నేతలు ఉన్నారని అన్నారు. పేదలు ఉన్నంత వరకు భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భీమలింగప్ప, క్రిష్ణ, గురుదాస్, మునిస్వామి, శేషుకుమార్, రాజు, రంగస్వామి పాల్గొన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి కృషి

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగ ప్రోత్సాహనికి తమ వంతు కృషి చేస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కర్నూలు క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన తైక్వాండో విజేతలకు బహుమతులు, ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని తైక్వాండో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ క్రీడాకారులకు, క్రీడారంగానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

● ఆత్మరక్షణ విద్యగా తైక్వాండో సాధన చేయాలని ప్రముఖ వైద్యులు డా.బి.శంకర్‌శర్మ తెలిపారు. ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో డా.శంకర్‌శర్మతో పాటు క్రీడా శిక్షకులు రామాంజనేయులు, చిన్న సుంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంటు పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ స్టేడియంలో ఆదివారం డబుల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు పోటీలు సీనియర్ ప్లేయర్స్ పేరెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఓపెన్ కేటగిరీలో మొదటి స్థానంలో విజయరాజు, ఇమ్మానుయేలు, రెండో స్థానంలో కౌశిక్, తరుణ్, మూడో స్థానంలో సాయినాథ్, పాల్ విజేతలుగా నిలిచారు. 35 ప్లస్‌లో మొదటి స్థానంలో శ్రీకాంత్, రామకృష్ణ, రెండో స్థానంలో బాషా, అనిల్, మూడో స్థానంలో రషీద్‌లు నిలిచారు. వీరికి ఎయిర్‌పోర్టు సీఐ శంకర్,ఈశ్వర్, ఇమ్మానుయేల్, జాన్, శేషు, సామేల్ నగదు బహుమతులను అందజేశారు. మొదటి స్థానం విజేతకు రూ.5వేలు, రెండో విజేతకు రూ.3 వేలు, మూడో విజేతకు రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, చిన్ను సూరి, మోహన్, శేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రింగ్ ఫైట్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి 8వ రింగ్ ఫైట్ పోటీలను ఆదివారం స్థానిక బీ.క్యాంపులోని టీజీవీ కళ్యాణ మండపంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జాతీయ రింగ్ ఫైట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, ప్రభాకర్ ప్రారంభించారు. రాష్ట్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులు ధర్మేంద్రగౌడు, అబ్దుల్లాలు మాట్లాడుతూ 18 రాష్ట్రాల నుంచి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాల బాలికల విభాగాలలో క్రీడాకారులు పోటీలకు హాజరైనట్లు తెలిపారు.

గోదా గోకులంలో ధనుర్మాస వేడుకలు


ఆలయంలో హోమము నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు మామిదాలపాడులో వెలసిన గోదా రంగనాథ స్వామి వారి దేవస్థానం (గోదా గోకులం క్షేత్రం)లో ధనుర్మాస వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా పదిహేనో రోజు ఆదివారం విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున 4.30 గంటలకు నిత్యా ఆరాధన, శ్రీదేవీ భూదేవి సమేత రంగనాథ స్వామి భోగమూర్తులకు, గోదా కృష్ణులు, సాలగ్రామాలకు పంచసూక్త పారాయణంతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామి, అమ్మవార్లకు అలంకరణ సేవ, తమాల సేవ నిర్వహించి, తెలుగులో తిరుప్పావై పాశురాల పారాయణం చేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా చిన్నారి కళాకారులతో ప్రదర్శించిన నృత్య దర్శయామి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

అలరించిన 'రాజ్‌కపూర్' చిత్ర గీతికల సంగీత విభావరి



కర్నూలు కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): అలనాటి ప్రఖ్యాత హిందీ నటుడు, చిత్ర నిర్మాత రాజ్‌కపూర్ శత జయంతి వేడుకల్లో భాగంగా రాజ్‌కపూర్ నటించి, నిర్మించిన చిత్రాల్లోని పాటలతో నిర్వహించిన సంగీత విభావరి ఆసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలుకు చెందిన ప్రముఖ గాయకుడు, మ్యూజిక్ కంపోజర్ సిరాజ్ రఫీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాయకులు, కళాకారులు రాజ్‌కపూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిరాజ్ రఫీతోపాటూ హైదరాబాదుకు చెందిన గాయని విజయలక్ష్మి, కర్నూలుకు చెందిన నజీర్ తదితరులు తమ పాటలతో ప్రేక్షకులను మైమరపించారు.

ప్రపంచ తెలుగు మహాసభల్లో జిల్లా సాహిత్యకారులు


6వ ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన కర్నూలు కవులు, రచయిత్రులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో గత రెండు రోజుల పాటు నిర్వహించిన 6వ ప్రపంచ తెలుగు మహాసభల్లో జిల్లాకు చెందిన కవులు, రచయిత్రులు తమ ప్రతిభ చూపి రాణించారు. ఆదివారం జరిగిన ముగింపు వేడుకల్లో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. మన్మథరావు, జస్టిస్ బి. కృష్ణమోహన్‌రావు, జస్టిస్ నగేశ్ భీమపాక హాజరయ్యారు. అలాగే ఆయా కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ సభల్లో జిల్లాకు చెందిన కవులు, రచయిత్రులు 'తెలుగు భాష పరిరక్షణ, రచయిత బాధ్యత' అనే అంశంపై ప్రసంగాలు చేసి సభకు విచ్చేసిన ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సభలకు రచయిత్రులు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఈ. దుర్గ, ఎ. హైమావతి, డాక్టర్ కె. మారుతికుమారి, ఎల్ఎల్ఎన్ ప్రసాద్, ఎం. లక్ష్మయ్య, ఝాన్సీ సాతర్ల, దివ్యశ్రీలతో పాటు యువ రచయిత్రులు ప్రవల్లిక, శ్వేత, సలీమా, ఉషలు పాల్గొన్నారు. వీరికి మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు.

ప్రపంచ తెలుగు మహాసభకు అధ్యాపకులు, విద్యార్థులు


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఆధ్యాపకులు, విద్యార్థులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు మహాసభలకు క్లస్టర్ వర్సిటీకి చెందిన ఆధ్యాపకులు, విద్యార్థులు హజరయ్యారని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు.. ఆదివారం జరిగిన సభకు కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు చెందిన ఆధ్యాపకులు దండబోయిన పార్వతి, డాక్టర్ వింధ్యావాసిని, విద్యార్థులు హజరయ్యారని, ప్రధాన అంశాల మీద ప్రసంగించారని, మేజర్ తెలుగు సెకండ్ ఇయర్ విద్యార్థులు ప్రవల్లిక, శ్వేత, సలీమా, తెలుగు ఉషా, మహేష్, ఖాజా అనే విద్యార్థులు కథ కవిత అనే అంశాల మీద ఈ సదస్సులో పాల్గొని కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సభాధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, దర్శకులు కృష్ణచేత జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారని తెలిపారు.

నేడు విధుల బహిష్కరణ: బార్ అసోసియేషన్

కర్నూల లీగల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనంతపురం మూడో పట్టణ పోలీసులు సీనియర్ న్యాయవాదిని వేధించి అతని మృతికి కారకులయ్యారంటూ సోమవారం కర్నూలు న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. గత శనివారం అనంతపురం మూడో పట్టణ పోలీసులు అనంతపురం సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రిని ఒక సివిల్ కేసు విచారణలో భాగంగా మూడో పట్టణ పోలీసులు స్టేషన్‌కు రప్పించారని, అక్కడ పోలీసు అధికారులు ఆయనను వేధించడంతో ఆందోళనకు గురై న్యాయవాది మృతి చెందాడన్నారు. ఆయన మృతికి మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ వ్యవహరించిన తీరే కారణమని న్యాయవాదులు ఆరోపించారు. ఆయన మృతికి కారకులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కర్నూలు న్యాయవాదులందరూ తమ విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సి. బెళగల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ తిమ్మారెడ్డి వాహనదారులకు సూచించారు. ఆదివారం జి.బెళగల్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహనాదారులు మోటార్ సైకిల్‌పై జరిమానాలను ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. అలా చెల్లించని వాహనాలను స్టేషన్‌కు తరలిస్తామని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలకాలని అన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. 31వ తేదీ రాత్రి యువత మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గౌడు, పోలీసులు ఉన్నారు.

మత్స్యకారులు అన్ని రంగాల్లో రాణించాలి


నియామకపత్రాన్ని అందుకుంటున్న బెస్త శ్రీనివాసులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యకారులు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి వంటి అన్ని రంగాల్లో రాణించాలని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు అన్నారు. ఆదివారం బీసీ భవన్‌లోని మత్స్యకారుల సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన బెస్త శ్రీనివాసులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉలిందకొండ శ్రీనివాసులు, శేషన్న, వెంకటేశ్, రాధాకృష్ణ, పరమేష్, సత్యనారాయణ, నాగరాజు, నందకిషోర్, కన్నా పాల్గొన్నారు.

జీవో 85 రద్దు కోరడం ఆధిపత్య వర్గాల కుట్ర: బీటీఏ

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పాల్గొన్న న్యాయకోవిదులు, రాజకీయ నాయకులు, తెలుగు రచయితలు మూకుమ్మడిగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలు జీవో.నెం.85ను రద్దు చేయాలని కోరడం అత్యంత దుర్మార్గమైన ఆలోచన అని.. ఇది అగ్రవర్ణాల, ఆధిపత్యవర్ణాల కుట్రేనని బహుజన టీచర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఆదివారం స్థానిక బీటీఏ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏ మాత్రం మానవత్వమున్నా, అభ్యుదయ ఆలోచనలున్నా ఆంగ్లంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని పాలకులపైనా ఒత్తిడి తేవాలన్నారు. అంతేగానీ ఆంగ్లమాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే రద్దు చేయమనే కోరే నైతికత మీకుందా..? అని మహాసభలో పాల్గొన్న న్యాయకోవిదుల పిల్లలు రాజకీయ నాయకుల పిల్లలు తెలుగు బాషా రచయితల పిల్లలు ఏ మాధ్యమంలో ఏ కార్పొరేట్ పాఠశాలల్లో చదివారో, ప్రస్తుతం ఏ దేశాల్లో ఉంటున్నారో దేశ ప్రజలకు తెలియజేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లోని అణగారిన వర్గాల పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదవడం మూలంగా వచ్చే నష్టం ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. చేతనైతే కార్పొరేట్ పాఠశాలల్లో కూడా తెలుగు మీడియం అమలు చేసేలా పాలకులపైన ఒత్తిడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి. రామశేషయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మత్తు పనుల్లో భాగంగా నగరంలో కరెంట్‌కోత ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 నుండి 12 గంటల వరకు సంతోష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. ఈమేరకు వెంకటరమణకాలనీ, కప్పలనగర్, పున్నమి ఫంక్షన్ హాల్, అశోక్‌నగర్, అమీన్‌అబ్బాస్ నగర్ ఏరియాలో కరెంట్‌కోత ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రైతు బజార్లలో దొంగలు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్‌నగర్, కొత్తపేట రైతుబజార్లలో కొనుగోలుదారులకు దొంగల భయం పట్టుకుంది. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా దొంగలు మాటు వేసి పర్సులతో పాటు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లిపోతున్నారు. ఇటీవల కాలంలో ఈ సమస్య ఎక్కువై పోవడంతో రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు మరోదారి లేక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వినియోగదారులకు దొంగల నుంచి ఉన్న ముప్పును నివారించాలని ఎస్టేట్ అధికారులు విజ్ఞప్తి చేయడంతో పోలీసులు రైతుబజార్లకు వచ్చి లౌడ స్పీకర్ల ద్వారా వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నారు. మరో వైపు కూరగాయలను కొనుగోలు చేసే క్రమంలో వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని, జేబుల్లో పర్సులు ఎవరైనా ఎత్తుకెళ్లే ప్రయత్నాలు చేస్తుంటే.. వెంటనే తమకు సమాచారం అందించాలని, వెంటనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పోలీసులకు అప్పగిస్తామని సీ. క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్ తెలిపారు.

కల్వర్టు ఎక్కడ?



మండలంలోని రాంపురం కొట్టాల- పెరవలి గ్రామాల మధ్య రోడ్డు వేసేందుకు కల్వర్టును ధ్వంసం చేశారు. అయితే బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలేశారు. ఈ దారి పొలాలకు వెళ్లేది కావడంతో రాంపురం కొట్టాల గ్రామానికి ఇలాగే వెళ్లాల్సి ఉంది. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. **- తుగ్గలి**

సూచిక ఎక్కడ?



మండల కేంద్రం నుంచి ముద్దటమాగి, కొగిలతోట, సమ్మాతాగేరి గ్రామాలకు వెళ్ళే ఆర్అండ్బీ రోడ్డుపై ప్రమాద సూచికలు కనిపించం లేదు. ఈ రోడ్డుపై వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని, మలుపులు, ఎల్ఎల్సీ కాలువ వంతెనలు ఉండడంతో, ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశముంది. ఆర్అండ్బీ ఏఈ సాయి సురేష్ వివరణ కోరగా రెండు రోజుల్లో చెట్లను తొలగిస్తామన్నారు. **- హొళగుంద.**

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

మద్దికెర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామం సన్రైజ్ పాఠశాల విద్యార్థులు అబాకస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ రవిశేఖర్ తెలిపారు. ఈ.పల్లవి, ఆర్.హారి, పుష్పాంజలి హసీనా ఎంపికయ్యారని అన్నారు. జనవరి 9న విజయవాడలో పోటీల్లో పాల్గొంటారన్నారు. టీడీపీ కార్యదర్శి పెరవలి రామాంజనేయులు విద్యార్థులను అభినందించారు.

అడ్డుకుంటే ప్రజలు క్షమించరు

ఆదోని టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటే ప్రజలు క్షమించరని ఇటీవల బీజేపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు వెల్లాల లలితమ్మ, సురేష్ హితవు పలికారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పార్థసారధి కృషి చేస్తుంటే మున్సిపల్ కౌన్సిల్లో మెజారిటీ ఉన్న వైసీపీ కౌన్సిలర్లు అడ్డుపడుతున్నారని అన్నారు. సమావేశంలో గొడవ సృష్టిస్తున్నారని, గత ప్రభుత్వ హయాంలో తమకు మాట్లాడే స్వేచ్ఛ లేదని, పార్థసారధి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతే మాట్లాడే స్వతంత్రం లభించిందన్నారు. కౌన్సిల్లో వైస్ చైర్మన్ నరసింహులు నోటికి హద్దు, అదుపు లేకుండా మాట్లాడటం, ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం ప్రజలు హర్షించరని హితవు పలికారు. వైసీపీ కౌన్సిలర్లు విజ్ఞతతో ఆలోచించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

సామాజిక సేవే సీపీఐ లక్ష్యం



రక్తదానం చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎప్పటికీ సామాజిక సేవే లక్ష్యంగా ముందడుగు వేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా చదువుల రామయ్య భవన్లో కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షతన నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాకల్పన ప్రారంభించారు. సుమారు 50 మందికి పైగా రక్తదానం చేశారు. ఎంపీటీసీలు ఈరన్న, నీలకంఠ, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, కారన్న, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, నెట్టికంటయ్య, రంగన్న, హనుమేష్, అల్తాఫ్, నజీర్ పాల్గొన్నారు.

తరలివెళ్లిన సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలకు పత్తికొండ నాయకులు ఆదివారం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. రంగారెడ్డి, గోపాల్, దస్తగిరి, సురేంద్ర, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాపై అభ్యంతరాలు తెలపండి

ఆలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీల జాబితాను గ్రామ సచివాలఆల నోటీసు బోర్డులో ఉంచామని ఇన్చార్జీ ఎంపీడీవో సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే సచివాలయల్లో వీఆర్వోలకు ఫిర్యాదు చేయాలని అయన కోరారు.

ధర్నాలు చేయడం సిగ్గుచేటు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచేసి.. ఇప్పుడు వైసీపీ నాయకులు ధర్నా చేయడం సిగ్గు చేటని మండల తెలుగు యువత అధ్యక్షులు మూలింటి రాము యాదవ్, మాజీ ఎంపీటీసీ పులిశేఖర్ ఎద్దేవా చేశారు. ఆదివారం పెరవలిలో మాట్లాడుతూ వైసీపీ తప్పుడు విధానాలతోనే విద్యుత్ రంగంపై రూ.వేల కోట్ల భారం పడిందన్నారు.

ఈసీ మెంబర్గా వెంకట మాధవ్

మద్దికెర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన శ్రీ విద్యా కళాశాల, పాఠశాల ఎండీ యజ్ఞం వెంకట మాధవ్ రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఈసీ మెంబర్గా ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల అధ్యక్షుడు విష్ణుప్రసాద్ నుంచి సమాచారం అందినట్లు వెంటక మాధవ్ ఆదివారం తెలిపారు. ప్రిన్సిపాల్ బాల సునీత, పీఈటీ భాస్కర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



సంచారం లేని వాహనం

- ఆలూరులో మూలనపడ్డ సంచార పశువైద్య వాహనం
- అవస్థలు పడుతున్న రైతులు, పశు యజమానులు



మూలన పడ్డ సంచార పశు ఆరోగ్యసేవ వాహనం

ఆలూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పశువులకు వైద్య సేవలదించేందుకు పభుత్వం సంచార పశువైద్యశాలలు ఏర్పాటు చేసింది. ఇందుకు ప్రత్యేకంగా టోల్ఫ్రీ నంబర్ 1962ను ఏర్పాటు చేసింది. ఆలూరు పశువైద్యశాలలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాహనాన్ని కూడా కేటాయించారు. పశు వైద్యురాలు, డ్రైవర్ను నియమించారు.

మూడు నెలలుగా మూలకు.

అయితే ఈ వాహనం మూడునెలలుగా మూలకు పడింది. వాహనంలోని బ్యాటరీ చోరీకి గురి కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని సిబ్బంది చెబుతున్నారు. మరో బ్యాటరీ అమర్చితే పనిచేసే అవకాశముంది. ఈ విషయంలో అధికారులు పట్టించు కోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

రైతుల అవస్థలు..

సంచార వాహనం పనిచే యకపోవడంతో రైతులు, పశువుల యజమానులు అవ స్థలు పడుతున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఆలూరు పశు వైద్యశాలకు రావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా వాహనం కదలక పోవడంతో డ్రైవర్ కూడా పత్తా లేకుండా పోయాడు. దీంతో సిబ్బంది ఇక్కడే విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారు.

మూడు నెలలుగా నిలిచిపోయింది

సంచార పశువైద్యశాల వాహనం మూడు నెలలుగా నిలిచిపోయింది. విషయాన్ని సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులకు తెలియజేశాం. డ్రైవర్ కూడా రావడం లేదు. టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు రైతులతో మాట్లాడి ఇక్కడే చికిత్స చేస్తున్నాం. మరమతులు పూర్తయిన వెంటనే యథావిధిగా గ్రామాలకు నేరుగా వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తాం. **- డా.అంజలి, పశు వైద్యురాలు, సంచార పశు ఆరోగ్యసేవ వాహనం**

మాజీ సర్పంచ్ మృతి

దేవనకొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్ మాజీ సర్పంచు గిరిపోగు నాగమ్మ (80) అదివారం అనా రోగ్యంతో మృతి చెందారు. 2003లో ఆమె సర్పంచుగా ఎన్నికయ్యారు. అమె మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు.



నాగమ్మ(ఫైల్)

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తుగ్గలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లింగాయత్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని టీడీపీ వీరశైవ లింగాయత్ సాధికారిత కమిటీ సభ్యుడు బాధడ కౌశిక్ కుమార్ ఆదివారం జి.ఎర్రగుడిలో అన్నారు. రాష్ట్రంలో దాదాపు 18 లక్షలు, జిల్లాలో 1.18లక్షల మంది లింగాయత్లు ఉన్నారని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

వేరుశనగ ఎకరాకు 8 క్వింటాళ్లు

మద్దికెర, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ దిగుబడి విషయంలో వ్యవసాయ అధికారులు మద్దికెరలో పంటకోత ప్రయోగం చేయగా ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఏవో రవి మాట్లాడుతూ మండలంలో 3,574 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారన్నారు. దిగుబడి ఆశా జనకంగా ఉందన్నారు.

పంటలు దెబ్బతింటున్నాయి



నీటితో నిండిన పొలాలను చూపుతున్న రైతు ఎల్లప్ప

హొళగుంద, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పైపులైన్ పగిలిపోయి పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఎల్లప్ప, సిద్దప్ప, జాంబాపురం బసవ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మాట్లాడుతూ హొళగుంద నుంచి హొన్నూరు కొట్టాలకు నిర్మిస్తున్న నూతన రోడ్డులో 56వ డీపీ (డిస్ట్రిబ్యూషన్ పాయింట్) వద్ద పైపు లైన్ పగిలిపోయిందన్నారు. రైతులు ఆర్ లక్ష్మణ, శరణప్ప, ఎస్ వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి రక్ష




సభ్యత్వ నమోదు చేస్తున్న పార్టీ నాయకులు

పత్తికొండ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కుటుంబానికి రక్ష అని ఆ పార్టీ నాయకుడు గోపాలం ఉచ్చీరప్ప అన్నారు. ఆదివారం 15వ వార్డులో నాయకులు ఖాదర్బాషా, రంగడు, షమీన్, రజీనాతో కలసి సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు నాయకత్వంలో పట్టణంలో రికార్డుస్థాయిలో సభ్యత్వాలు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

సీపీఎం భూ పోరాటం

పత్తికొండ టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహుల్తి గ్రామ సమీపంలోని సర్వే నెంబరు343 ప్రభుత్వ భూముల్లో సీపీఎం నాయకులు జెండాలు పాతారు. మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాలకే ప్రభుత్వ స్థలంలో జెండాలు పాతామన్నారు. అధికారులు పట్టాలు ఇవ్వాలని కోరారు. రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్, రంగన్న, రామాంజనేయులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు స్థలం విరాళం



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలకు బొమ్మన నరేంద్రనాథ్ రెడ్డి, బొమ్మన దశరాథరెడ్డి 30 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఏబీఎం సంఘ పెద్దలు బొమ్మన దశరథరామిరెడ్డిని సన్మానించారు. బొమ్మన శ్రీకర్ రెడ్డి, బొమ్మన శ్రీధర్ రెడ్డి, ఏబీఎం సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు దక్కిన పురస్కారం

ఆస్పరి, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న తొమ్మిదిమంది పోలీసు సిబ్బందికి ఉత్తమ అవార్డు, రివార్డు దక్కినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. నాలుగు నెళ్ల క్రితం చిన్నహోతూరు గ్రామ సమీపంలో వ్యక్తి హత్య కేసు విచారణలో ప్రతిభ కనపరచిన ఎస్బీ కానిస్టేబుల్ అక్బర్కు ఎస్పీ బిందు మాధవ్ ఆదివారం కర్నూలులో ప్రశంసా పత్రం ఇచ్చారని అన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న అక్బర్

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

- తుగ్గలి, వెల్దుర్తి దేవనకొండ మండలాల్లో కలుసుకున్న విద్యార్థులు



తుగ్గలి : పెండేకల్ ఆర్ఎస్ జడ్పీ పాఠశాల 1999 బ్యాచ్..



వెల్దుర్తి జడ్పీ బాలుర పాఠశాల 1989-90 బ్యాచ్ విద్యార్థులు

తుగ్గలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెండేకల్ ఆర్ఎస్ జడ్పీహెచ్ పాఠశాల 1994- 1999 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశా లలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు.



దేవనకొండ మండలం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

1989-90 బ్యాచ్..

వెల్దుర్తి: స్థానిక జడ్పీ బాలుర పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 34 సంవత్సరాల తరువాత కలుసుకుని, నాటి జ్ఞాపకాలను, అనుభూ తులను గుర్తు చేసుకు న్నారు. ఉపాధ్యాయులు శంకరయ్య, శేషఫణి శర్మ, నారాయణరెడ్డి, హైమావతమ్మను సన్మానించారు. పాఠశాలకు రూ.25 వేల విలువచేసే జిరాక్సు మిషన్ను అందజేశారు. కార్యక్రమంలో రవిరెడ్డి, రఘురామిరెడ్డి, మురళీ మోహన్రెడ్డి, మహేష్, శ్రీధర్శర్మ, ఖాజా, గఫూర్ పాల్గొన్నారు.

44 సంత్సరాల తరువాత కలుసుకున్నారు..

దేవనకొండ: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల 1979-80 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో సమ్మేళనం నిర్వహించారు. మిత్రులను కలుసుకుని ఆనందరం వ్యక్తం చేశారు. నాటి ఉపాధ్యాయులు భక్తవత్సలం, కిష్టయ్యను సన్మానించారు.

నిధులు ఇవ్వండి

ఆలూరు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవళ్లి చెరువు ముళ్ళకంపతో నిండిందని చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కురవళ్లి సర్పంచ్ ఉప్పర రవి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కురవళ్లి చెరువు కింద 100 ఎకరాల ఆయకట్టు ఉందని, పూడికతో నీరు లేకుండా పోయిందని, పిల్ల కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు.

బకాయిలు చెల్లించాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ కోరారు. ఆదివారం మాట్లాడుతూ 11వ పీఆర్సీలోని ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, నూతన పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు.

ప్రశాంతంగా చేసుకోవాలి

తుగ్గలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా చేసుకోవాలని పత్తి కొండ రూరల్ సీఐ పులిశేఖర్ సూచిం చారు. ఆదివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీసు స్టేషన్లలో మాట్లాడుతూ డిసెం బరు 31న రాత్రి మద్యం సేవించి వాహనాల్లో శబ్దాలు చేయొద్దని, డీజేలు పెట్టకూడ దన్నారు. రాత్రివేళ్లలో ఆరుబయట గుంపులుగా కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో బహిరంగ వేడుకలు జరుపుకో కూడదన్నారు. తుగ్గలి జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, జయశేఖర్ ఉన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

క్రిష్ణగిరి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి, కోయిలకొండ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సచివాలయాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సీఈవోలు శివన్న, రమేష్ సూచించారు. రుణాలు, ఎరువులు, ఓటు హక్కు కావాలంటే ఈకేవైసీ తప్పనిసరి అన్నారు.

జీవో 117 రద్దుతోనే పాఠశాలల బలోపేతం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ముత్తన్న

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 117ను రద్దు చేస్తే ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అవుతాయని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ముత్తన్న అన్నారు. ఆదివారం కార్యాలయంలో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.117తో ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయన్నారు. పదో తరగతిలో 100రోజుల ప్రణాళిక అంటే విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేయడమే నన్నారు. సెలవుల్లోనూ తరగతులు నిర్వహించడం ప్రభుత్వానికి తగదన్నారు. 33 శాతం ఐఆర్ను వెంటనే ప్రకటించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సంగమేశ్వర్, బీమారెడ్డి, సిద్ధలింగ, తిక్కస్వామి, పార్థసారథి, రామాంజినేయులు, రాఘవేంద్ర, బీరప్ప, రఘురామయ్య పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతులకు రుణాలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- సీఈవో మనోహర్ నాయుడు



తుగ్గలి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సొసైటీ ద్వారా రైతులకు రుణాలు ఇస్తున్నామని సీఈవో మనోహర్ నాయుడు అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఏ రుణాలు ఇస్తున్నారు?

జవాబు: పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు గొర్రెలు, బర్రెలు, ట్రాక్టర్ పండ్ల తోటల రుణాలు ఇస్తున్నాం.

ప్రశ్న: రైతులకు ఎలాంటి సేవలు అందుబాటులో ఉన్నాయి?

జవాబు: విద్యుత్ బిల్లు, రైల్వే బుకింగ్, సీబిల్ స్కోర్, మరిన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: రైతులకు ఇచ్చే రుణ పరిమితి?

జవాబు: పంట రుణాలు రూ.3లక్షలు, దీర్ఘకాలిక రుణాలకు రూ.10లక్షలు, రూ.13 లక్షలు రైతుల భూమి ఆధారంగా ఇస్తాం.

ప్రశ్న: సొసైటీల్లో ఆన్లైన్ సేవలు ఎప్పుడు ప్రారంభమవుతాయి?

జవాబు: వచ్చే జనవరి నాటికి రైతులకు ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉంటాయి..

ప్రశ్న: రైతులకు ఎరువులు ఇస్తున్నారా?

జవాబు: రుణాలతో పాటు ఎరువుల పంపిణీ, భూసార పరీక్షలతో పాటు పంట దిగుబడులను కూడా కొనుగోలు చేస్తాం. వచ్చే ఏడాది నుంచి ఈ పథకాలన్నీ ప్రారంభమవుతాయి.

ప్రశ్న: ఈకేవైసీ తప్పనిసరా?

జవాబు: సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులతో పాటు ఖాతా ఉన్న ప్రతి సభ్యుడు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి. అప్పుడే ప్రభుత్వ సబ్సిడీలు, ఎరువులు అందుతాయి. రుణాలు తీసుకున్న రైతులు 2,500 మందితో పాటు 4,890 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ ఈకేవైసీ చేయించుకోవాలి

ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి విజయకుమార్

కోసిగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని ఆర్లబండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఖాతాదారులు తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి విజయకుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ పూర్తి చేయడం ద్వారా ఖాతాదారులు ప్రభుత్వ రాయితీ పొందుతారని, ఓటు హక్కును కలిగి ఉంటారని తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియను పూర్తిచేయని ఖాతాదారులు సహకార సంఘం ద్వారా అందించే సున్నావడ్డీ రుణాలు, పంట విక్రయాల వంటి రుణాలు కోల్పోతారన్నారు. సహకార సంఘం సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి


కుర్నూరు గ్రామంలో సీసీరోడ్డుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు టీడీపీతోనే సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ నజీర్, చిన్ననేలటూరు నాగన్న అన్నారు. ఆదివారం కుర్నూరు గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత నెల రోజులుగా గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో దాదాపు రూ. 2కోట్ల తో సీసీరోడ్డు, డ్రైనేజి పనులకు భూమిపూజ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రబాడు శ్రీనివాసులు, పుట్టపాశం వెంకటేశ్వరాచారి,హరికృష్ణ, కుర్నూరు రమణ, హెచ్ కైరవాడి తిమ్మారెడ్డి, రాజేష్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నందవరంలో విశ్వ హిందూ పరిషత్ ఆందోళన

నందవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన, ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. విశ్వహిందు పరిషత్ జిల్లా కమిటీ మెంబర్ ఉపేంద్ర రెడ్డి ఇంటిపై ఓ వర్గం శనివారం రాత్రి దాడి చేసి ఇంటిపై అద్దాలను పగలగొట్టారు. దీంతో ఆదివారం విశ్వహిందు పరిషత్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసవన్నగౌడు, ఉపాధ్యక్షుడు కార్యదర్శి హనుమంతురెడ్డి, శశిధరరెడ్డి, భజరంగ్‌దళ్ నాయకులు మాధవరం రాఘవేంద్రరెడ్డి నందవరానికి చేరుకుని బాధితుడు ఇంటినుంచి ర్యాలీగా బస్టాండ్‌కు చేరుకుని అక్కడ ధర్నా, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన నాయకులు పోలీసు అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాలపల్లి పాఠశాల విద్యార్థుల ప్రతిభ


సర్టిఫికెట్లు అందుకుంటున్న మాలపల్లి విద్యార్థినులు

మంత్రాలయం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాలపల్లి జీఎన్ఎస్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. ఆదివారం కర్నూలులో జరిగిన అబాకస్ పోటీల్లో పవిత్ర, మనోహర్‌లు మూడో బహుమతిని అందుకున్నారు. శిక్షణ ఇచ్చిన ప్రధానోపాధ్యాయురాలు నాగవీణ వీరికి అభినందించారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయుడు మల్లికార్జున, టీడీపీ నాయకులు బసలదొడ్డి ఈరన్న, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, సాగునీటి సంఘం చైర్మన్ చంద్ర, వీరేషాచార్ అభినందించారు.

ముళ్ల కంపలో ఆరోగ్య కేంద్రం



కోసిగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని పల్లెపాడు గ్రామంలోని ఆరోగ్య కేంద్రం ముళ్ల కంపల మధ్యలో ఉండటంతో బాలింతలు, గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ ముళ్లకంపలు పెరిగి దారి వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా మారిందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్ల కంపలు ఉండటంతో విష పురుగులు, పాములు ఆరోగ్య కేంద్రంలోకి వస్తున్నాయని, ఆరోగ్య సిబ్బంది వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న ముళ్ల కంప చెట్లను తొలగించి రహదారి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎరుపెక్కిన ఎమ్మిగనూరు



- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- అట్టహాసంగా సీపీఎం 23వ జిల్లా మహాసభలు

ఎమ్మిగనూరు టౌన్/రూరల్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం జరిగిన 23వ సీపీఎం జిల్లా మహాసభలతో సీపీఎం జెండాలతో ఎరుపెక్కింది. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌తో పాటు అన్ని కూడళ్లలో సీపీఎం జెండాలు రెపరెపలాడాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఎర్రజెండలను కట్టడంతో ఎరుపుమయంగా మారింది. జిల్లా మహాసభలను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సీపీఎం శ్రేణులు ఎర్రజెండాలను పట్టుకొని స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్, ప్రభుత్వ ఆస్పత్రి, శ్రీనివాస సర్కిల్ ట్యాంక్‌బండ్ రోడ్డు, షరఫ్‌బజార్, గోనెగండ్ల రోడ్డు, గాంధీ సర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా బహిరంగ సభ వేదిక అయిన తహసీల్దార్ కార్యాలయ ఆవరణకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పురవీధుల గుండా సీపీఎం డప్పు కళాకారులు డప్పును వాయిస్తూ ప్రజా నాట్యమండలి కళాకారులు నృత్యాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. సీపీఎం వర్థిల్లాలని నినాదాలు చేయడంతో ఉత్సాహంగా కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ వేదికపై ప్రజా నాట్య మండలి సభ్యులు పలు విప్లవ గీతాలను ఆలపించడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. కోలాటాలతో మహిళా కార్యకర్తలు ఆలపించిన గేయాలు అందరిని అలరించాయి. అలాగే పత్తికొండకు చెందిన ఓ సీపీఎం కార్యకర్త ఎర్ర జెండ ఎర్రజెండ ఎన్నియల్లో.. అంటూ ఆలపించిన గేయానికి నృత్యం చేయడం సభికులను ఎంతగానో అలరించింది. ప్రజానాట్య మండలి కళాకారులను సీపీఎం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాలైన సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘం, రైతు సంఘం నాయకులు గోవిందు, రాముడు, హనుమంతు, రామన్న, గోవర్ధనమ్మ, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోలాటం చేస్తున్న మహిళా కళాకారులు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

శనగను ముసురు ముంచుతోంది

గోనెగండ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గత పదిరోజులుగా ఆకాశం ముసురుకుంటుంది. దీంతో శనగ పంటకు లద్దెపురుగు సోకుతుంది. పూత రాలిపోతుంది. మండల వ్యాప్తంగా గోనెగండ్ల, హెచ్ కైరవాడి, వేముగోడు, పుట్టపాశం, నెరుడుప్పల, చిన్నమరివీడు, పెద్దమరివీడు, పిల్లిగుండ్ల, ఈరంపల్లి, బోదేపాడు, అలువాల, కులుమాల, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో రెండు వేల ఎకరాల్లో శనగపంటను సాగు చేశారు. అయితే ఆకాశం ముసురు కమ్ముకోవటంతో శనగ పూత ముడుచుకుని కుళ్లి రాలి పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పూత పట్టి గింజ పట్టే సమయంలో ప్రకృతి ముసురు రూపంలో శనగ రైతులను ముంచుతుందని రైతులు వాపోతున్నారు.


పూత రాలిపోయిన శనగ పంట

అధ్వానంగా ఎల్లెల్సీ కాలువ


మాధవరం మేజర్ ఎల్లెల్సీ కాలువను కప్పేసిన ముళ్ల కంప

కోసిగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధవరం మేజర్ ఎల్లెల్సీ కాలువలు ముళ్ల చెట్లతో నిండిపోవడంతో.. ఆయకట్టుదారులకు సాగునీరు అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎల్లెల్సీ మాధవరం మేజర్ కెనాల్ శిథిలమైనా పట్టించుకోకపోవడంతో నేడు ఆయకట్టు రైతులకు చివరి వరకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటి కూటమి ప్రభుత్వంలోనైనా ఎల్లెల్సీ కాలువలను బాగు చేసి చివరి ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వాలని కోరుతున్నారు. ముఖ్యంగా కాలువలు శిథిలం కావడంతో నీరు వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి సంఘాల నాయకులు దగ్గరుండి మాధవరం ఎల్లెల్సీ కాలువ మరమ్మతులు పనులు చేపట్టి చివరి ఆయకట్టు రైతులకు నీరు అందించాలని కోరుతున్నారు.


కూలీలు దొరక్కపోవడంతో పత్తి తీయక అలాగే వదిలేసిన రైతులు

దొరకని కూలీలు..

- పొలాల్లోనే పత్తి..
- ఆందోళనలో రైతులు

కోసిగి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది అధికశాతం కూలీలు వలసబాట పట్టారు. స్థానికంగా పత్తి రైతులకు కూలీలు దొరకడం లేదు. దీంతో పత్తి రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పక్క రాష్ట్రాల్లో పత్తి కిలో రూ.12 నుంచి రూ.15లు ఇస్తుండటంతో స్థానికంగా పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అంత ధర ఇచ్చుకోలేక, కూలీలు దొరక్క పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో పత్తి పంట వేసిన రైతులు కూలీలు దొరక్క పత్తి పగిలినా అలాగే వదిలేయడంతో పంట పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో పత్తి రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. స్థానికంగా వలస కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో పత్తి తీసేందుకు కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐకి పురస్కారం



అవార్డును అందుకుంటున్న ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్ రాజు

మంత్రాలయం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజుకు ఉత్తమ సేవ, నగదు పురస్కార అవార్డులను అందుకున్నారు. ఆదివారం కర్నూలులో ఎస్పీ జి.బిందుమాధవ్, ఏఎస్పీ హుశేన్ పీరా, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ అవార్డును అందుకున్నారు. గత ఏడాది నుంచి కేసుల పరిష్కారం, ముందస్తు సమాచార సేకరణ, చోరీ జరిగిన సంఘటనలను చాకచక్యంగా వ్యవహరించడం పట్ల 2024 ఉత్తమ సేవా పురస్కారం, నగదు పురస్కారానికి ఎంపికకాగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ గంగాధర్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరగాళ్ల దాడులు ఎక్కువయ్యాయని తెలిపారు. కస్టమ్స్, సీబీఐ, ఈడీ, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో వంటి సంస్థలనుంచి మాట్లాడుతున్నట్లు ఎవరైనా ఫోన్ చేస్తే అనుమానించాల్సిందేనన్నారు. ఇప్పటి వరకు సైబర్ నేరాలలో ఆరు నెలలలో బాధితులు సుమారు రూ. 293 కోట్లు నష్టపోగా అందులో కేవలం రూ. 3.50 కోట్లు మాత్రమే(1.1శాతం) తిరిగి రాబట్టినట్లు తెలిపారు. మరో రూ. 44 కోట్లు ఖాతాలలో స్థంభింపచేయగలిగారన్నారు డిజిటల్ అరెస్టులు అంటు బెదిరించడం, పార్శిళ్లలో మారకద్రవ్యాలు ఉన్నాయంటు బెదిరింపులు వస్తే ఎట్టి పరిస్థితుల్లోను భయపడవద్దని తెలిపారు. ఈలాంటి బెదిరింపు కాల్స్ వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. గుర్తు తెలియని నెంబర్ల నుంచి వీడియో కాల్స్ కు స్పందించవద్దన్నారు. సైబర్ బాధితులు 1930 టోల్ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రతి కార్యకర్తకు ఉచితంగా సభ్యత్వం చేయిస్తాం


నందవరంలో సభ్యత్వం అందజేస్తున్న టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు

నందవరం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): నందవరంలో ప్రతి టీడీపీ కార్యకర్తకు ఉచితంగా సభ్యత్వం చేయిస్తానని ఆపార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడు అన్నారు. ఆదివారం నందవరంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటా తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. బడుగు బలహీన వర్గాల కార్యకర్తలు ప్రతి ఒక్కరు వచ్చి ఉచితంగా సభ్యత్వం చేయించుకోవాలన్నారు. కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మస్తాన్, నరసప్ప, రహిమాన్‌బాష, నాగరాజు, ముత్తు, వీరేష్, జగదీష్, నవీన్, నాగప్ప కార్యకర్తలు పాల్గొన్నారు.

తుంగభద్ర తీరంలో భక్తుల సందడి

మంత్రాలయం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): తుంగా తీరం భక్తులతో పులకరించిపోయింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఇసుకేస్తే రాలనంత భక్తులు తరలివచ్చారు. ఏడాది ఆఖరి ఆదివారం సెలవు కలసి రావటంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి దర్శన క్యూలైన్స్‌ను పెంచి, పరిమళప్రసాదం కౌంటర్లు అధనంగా ఏర్పాటు చేశారు. మంత్రాలయం ఎటుచూసిన భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీ పెరగడంతో ప్రైవేట్ లాడ్జీల ధరలకు రెక్కలొచ్చాయి. చలికాలం కావడంతో గదులు దొరక్కా భక్తులు మధ్వమార్గ్ కారిడార్‌లో నిద్రిస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతం, నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

కిక్కిరిసిన వాహనాలు

రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తుల వాహనాలతోనే మంత్రాలయం నిండిపోయింది. ఈ ఏడాది ముగింపు సందర్భంగా చివరి ఆదివారం కావడంతో వేలాది మంది వాహనాల్లో రావడంతో ఏ దారి, వీధి చూసినా వాహనాలతో నిండిపోయింది. దీనితో నిత్యం రాకపోకలు సాగించే కర్ణాటక, ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల ప్రైవేటు వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు, ఉన్నత పాఠశాల మైదానం, తహసీల్దార్ కార్యాలయం, నాగులదిన్నె రోడ్డు, ఎమ్మిగనూరు రోడ్డు, మాధవరం రోడ్డు, ప్రధాన రహదారులు కి.మీటరున్నర మేర ఇరువైపులా పార్కింగ్ కనిపిస్తున్నాయి. హైవే రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయడంతో పోలీసులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని చూపాలని భక్తులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో నిలిచి ఉన్న వాహనాలు


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు